క్లుప్తంగా

మాజీ మంత్రి కాకాణి పరామర్శ



పద్మయ్యను పరామర్శిస్తున్న గోవర్ధన్‌రెడ్డి

వెంకటాచలం: సిరి మల్టీప్లెక్స్ థియేటర్ అధినేత ఉప్పు పద్మయ్యను మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పరామర్శించారు. పద్మయ్య సోదరుడు, వెంకటాచలం ఎంపీటీసీ మాజీ సభ్యుడు ఉప్పు వెంకటేశ్వర్లు ఇటీవల మృతి చెందారు. గురువారం జరిగిన ఆయన కర్మక్రియలకు కాకాణి విచ్చేసి పద్మయ్యతోపాటు కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మందల వెంకటశేషయ్య ఉన్నారు.

లబ్ధిదారుల ఎంపిక నేడు

తోటపల్లిగూడూరు: బీసీ కార్పొరేషన్ రుణాలకు సంబంధించి లబ్ధిదారుల ఎంపిక శుక్రవారం జరుగుతుందని ఎంపీడీఓ వెంకటేశ్వరరావు తెలిపారు. స్థానిక కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ బీసీ, ఈబీసీ, కాపు కార్పొరేషన్లకు సంబంధించి మండలానికి 30 యూనిట్లు మంజూరయ్యాయన్నారు. 22 పంచాయతీల నుంచి 327 మంది దరఖాస్తులు వచ్చాయన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 11గంటలకు లబ్ధిదారులకు ఎంపిక కోసం అర్హత పత్రాలను పరిశీలిస్తామన్నారు. తోటపల్లిగూడూరు, నరుకూరు, పేడూరులో ఉన్న స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా. కోడూరు కెనరా బ్యాంక్, ఈదూరులోని పినాకిని గ్రామీణ బ్యాంక్ అధికారులు ఇంటర్వ్యూలకు హాజరై లబ్ధిదారులను ఎంపిక చేస్తారన్నారు.

రుణాల మంజూరుకు ఇంటర్వ్యూలు



బుచ్చిరెడ్డిపాళెం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈబీసీ రుణాల మంజూరుకు సంబంధించి మహిళలకు గురువారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఎంపీడీఓ శ్రీహరి, దామరమడుగు కార్పొరేషన్ బ్యాంక్ మేనేజర్ బాలాజీ పాల్గొన్నారు.

జయప్రదం చేయండి



మాట్లాడుతున్న సీపీఎం నేతలు

బుచ్చిరెడ్డిపాళెం: రైతులకు మద్దతు ధర లభించకపోవడంతో ఈనెల 22న తలపెట్టిన చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని రైతు, వ్యవసాయ సంఘం నేతలు పులిగండ్ల శ్రీరాములు, జొన్నలగడ్డ వెంకమరాజు కోరారు. మండలంలోని కాగులపాడు పంచాయతీ బాపనపాడు నుంచి ప్రచార రథం కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ప్రతిఒక్కరూ తరలిరావాలని కోరారు. మండల నాయకులు గండవరపు శ్రీనివాసులు, పుత్తేటి మల్లికార్జున, బుజ్జయ్య, వెంకటేశ్వర్లు, ఏడుకొండలు పాల్గొన్నారు.

తల్లి మందలించడంతో కుమారుడి పరార్

- గుర్తించి అప్పగించిన పోలీసులు

కోవూరు: తల్లి మందలించడంతో కుమారుడు ఇంటి నుంచి పారిపోయిన ఘటన బుధవారం అర్ధరాత్రి చోటుచేసుకొంది. పోలీసుల కథనం మేరకు.. నెల్లూరు బాలాజీనగర్ ప్రాంతానికి చెందిన చంద్రశేఖర్ ఆరో తరగతి చదువుతున్నాడు. ఈ క్రమంలో తల్లి మందలించడంతో బాలుడు ఇంటి నుంచి పారిపోయి కోవూరు రైల్వేస్టేషన్‌లో తిరుగుతున్నాడు. రైల్వే సిబ్బంది గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు ఎస్సై రంగనాథ్‌గౌడ్ బాలుడిని తీసుకొచ్చి గురువారం తల్లిదండ్రులు ప్రసాద్, నరసమ్మలకు అప్పగించారు.

ఆర్టీసీ బస్టాండ్.. సమస్యలకు నిలయం

- అధ్వానంగా తోటపల్లిగూడూరు బస్టాండ్
- కనీస వసతుల్లేక నిరుపయోగంగా మారిన వైనం
- అక్కడ అడుగుపెట్టని ఆర్టీసీ బస్సులు
- ప్రయాణికుల ఇబ్బందులు

తోటపల్లిగూడూరు: ఇష్టానుసారంగా చార్జీలు పెంచి ప్రయాణికులపై భారం మోపుతున్న ఆర్టీసీ యాజమాన్యం బస్టాండ్లలో తగిన వసతులు కల్పించడంపై మాత్రం దృష్టి సారించడం లేదు. మండల కేంద్రమైన తోటపల్లిగూడూరులో ఉన్న ఆర్టీసీ బస్టాండ్‌లో వసతుల్లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తోటపల్లిగూడూరు, ఇస్కపాళెం, తోటపల్లి, మాచర్లవారిపాళెం, మల్లికార్జునపురం, వరకవిపూడి, చంద్రశేఖరపురం, కోడూరు, అనంతపురం, వరిగొండ, ఈదూరు తదితర గ్రామాలకు ఆర్టీసీ సదుపాయం ఉంది. కాగా బస్టాండ్‌లో సమస్యల కారణంగా బస్సులు లోనికి రాకుండా బయటి నుంచే వెళ్లిపోతున్న పరిస్థితులున్నాయి.

పట్టించుకోకుండా..

రోజూ వందలాది మంది ప్రయాణికులు బస్టాండ్‌కు వస్తుంటారు. అయితే ప్రయాణికులకు వసతుల కల్పనలో ఆర్టీసీ విఫలమైంది. సిబ్బంది లేకపోవడంతో రాకపోకలు సాగించే వారికి బస్సుల వేళలు తెలియక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అంతేకాక చెత్తాచెదారాలతో బస్టాండ్ దారుణంగా మారిపోతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోడం లేదు. దీంతో కూర్చోలేని పరిస్థితులు వచ్చాయి. దాని ప్రాంగణం గుంతలమయంగా ఉండటంతో వర్షాలు కురిస్తే చిన్నపాటి చెరువును తలపిస్తుంది. తాగునీటి కుళాయిలున్నా ఉపయోగం శూన్యం. మరుగుదొడ్లు నిరూయోగంగానే ఉంటున్నాయి. సిబ్బంది లేకపోవడంతో ప్రయాణికులకు ముఖ్యంగా మహిళలు, విద్యార్థినులకు రక్షణ లేకుండా పోయింది.



తోటపల్లిగూడూరు ఆర్టీసీ బస్టాండ్



నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్డి

చాలాకాలంగా బస్టాండ్ సమస్యలకు నిలయంగా ఉన్నా అధికారులు స్పందించకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



తాగునీటి కుళాయి ఇలా..

కనీస వసతులు కల్పించాలి



ఆర్టీసీ బస్టాండ్‌లో కనీస వసతులు కల్పించే విషయంలో సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. తాగునీరు లేదు. సమస్యల్ని పరిష్కరించాలి.

– ప్రవీణ్‌కుమార్, తోటపల్లిగూడూరు

బస్సులు నిలిపేలా చూడాలి



తోటపల్లిగూడూరులోని ఆర్టీసీ బస్టాండ్ నిరుపయోగంగా మారడం ఎంతో బాధగా ఉంది. కనీస సౌకర్యాలు లేకపోవడం ప్రయాణికులకు ఎంతో ఇబ్బందిగా మారింది. అధికారులు స్పందించాలి. బస్సులు బస్టాండ్‌లోకి వచ్చేలా చూడాలి.

– రాయపు శ్రీనివాసులు, ఇస్కపాళెం

రైతులను ఆదుకోవాలంటూ ధర్నా



ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు, కార్యకర్తలు

పొదలకూరు: రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ పొదలకూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద గురువారం బీజేపీ నాయకులు, కార్యకర్తలు కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ నేత మిడతల రమేష్ మాట్లాడుతూ అధికారుల నిర్లక్ష్యం వల్ల రైతులు గిట్టుబాటు ధరలకు ధాన్యం అమ్ముకోలేకున్నారని ఆరోపించారు. జిల్లాలో ప్రభుత్వ అధికారులు ఈనెల 15 నుంచి 300 రైతు సేవా కేంద్రాలను ధాన్యం కొనుగోలు కేంద్రాలుగా వినియోగంలోకి తీసుకొస్తామని చెప్పారన్నారు. ఇప్పటి వరకు 100 కేంద్రాలను ప్రారంభించలేదన్నారు. మొదలైన చోట్ల గోతాలను అందుబాటులో ఉంచలేదని విమర్శించారు. ప్రస్తుతం బీపీటీ రకం ధాన్యం రూ.17 నుంచి రూ.18 వేలు, నెల్లూరు మసూరా రూ.16 వేలు, కేఎన్ఎం రూ.18 వేలు ఒక పుట్టికి అందజేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో 36 వేల మంది కౌలు రైతులున్నారని వారి పరిస్థితి దయనీయంగా మారిందని, పెట్టుబడులు పెరిగి ఆదాయం తగ్గిందన్నారు. ఈ ప్రాంతంలో వరికోతలు మొదలయ్యాయని రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యాన్ని గిట్టుబాటు ధరలకు కొనుగోలు చేయాల్సిందిగా డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు అయోధ్య రామయ్య, రాచపూటి ధనుంజయరావు, సీహెచ్ చినసుబ్రహ్మణ్యం, రవీంద్రబాబు పాల్గొన్నారు.

పలువురికి ప్రసన్న పరామర్శ



కోవూరులో..

కోవూరు: మాజీ ఏఎంసీ చైర్మన్ పచ్చిపాల రాధాకృష్ణారెడ్డి సతీమణి విజయలక్ష్మి ఉత్తరక్రియలు గురువారం కోవూరులో జరిగాయి. మాజీ మంత్రులు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి హాజరై, ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. పార్టీ నేతలు దొడ్డంరెడ్డి నిరంజన్‌బాబురెడ్డి, వీరి చలపతిరావు, కవరగిరి శ్రీలత, హరిప్రసాద్‌రెడ్డి, కొండ్రెడ్డి రంగారెడ్డి, కాటంరెడ్డి దినేష్‌రెడ్డి, అత్తిపల్లి అనూప్‌రెడ్డి పాల్గొన్నారు.



బుచ్చిరెడ్డిపాళెం : రెడ్డిపాళెంలో..

బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని రెడ్డిపాళెంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు కొటంరెడ్డి రాఘవరెడ్డి తల్లి వజ్రమ్మ ఉత్తరక్రియలకు మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. పార్టీ మండలాధ్యక్షుడు చెర్లో సతీష్‌రెడ్డి, సర్పంచ్ పత్తి వెంకటరమణారెడ్డి, పార్టీ నేతలు బాల శంకర్‌రెడ్డి, వేణుంపాక సదాశివరెడ్డి, కాలేషా, గంగిరెడ్డి పాల్గొన్నారు.

డిగ్రీ పరీక్షలకు ఇద్దరు గైర్హాజరు

వెంకటాచలం: విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ) పరిధిలోని అనుబంధ కళాశాలల్లో గురువారం నిర్వహించిన డిగ్రీ ఒకటో సెమిస్టర్, నాలుగో సెమిస్టర్ పరీక్షలకు ఇద్దరు విద్యార్థులు గైర్హాజరయ్యారని వర్సిటీ పరీక్షల నిర్వహణాధికారి డాక్టర్ సీహెచ్ వెంకట్రాయులు తెలిపారు. మొత్తం 230 మందికి గానూ 228 మంది హాజరయ్యారని వెల్లడించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలపై అవగాహన

- ఏడీఏ శివనాయక్

పొదలకూరు: రైతులకు ధాన్యం కొనుగోలు కేంద్రాలపై అవగాహన ఉండాలని పొదలకూరు సహాయ వ్యవసాయ సంచాలకుడు కె.శివనాయక్ అన్నారు. స్థానిక సచివాలయం – 3లో గురువారం కొనుగోలు కేంద్రాలపై రైతులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ గ్రేడ్ రకం పుట్టి ధాన్యం రూ.19,720 (క్వింటాళ్లు రూ.2,320) మద్దతు ధరలను ప్రకటించినట్టు తెలిపారు. రైతులకు గోనెసంచులను ఉచితంగా అందజేయడం జరుగుతుందని, లేబర్, ట్రాన్స్‌పోర్ట్ చార్జీలను ప్రభుత్వమే భరిస్తుందన్నారు. రైతు సేవా కేంద్రాల వద్ద ధాన్యాన్ని అమ్ముకునేందుకు అవకాశం కల్పిస్తున్నట్టు వెల్లడించారు. ముందుగా రైతులు ఈకేవైసీ చేయించుకోవాల్సిందిగా సూచించారు. స్థానిక పీఏసీఎస్ వద్ద ట్రక్ షీట్ జనరేట్ చేయించుకుని వారికి కేటాయించిన మిల్లుకు తరలించాల్సిందిగా చెప్పారు. కార్యక్రమంలో ఏఓ ఎ.వాసు, మస్తాన్‌బాబు, సీఈఓ రాధాకృష్ణారెడ్డి, కె.ప్రభాకర్‌రెడ్డి, కె.భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

మనుబోలు: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వ్యక్తిగత ప్రమాద బీమా (పీఏఐ) పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని మనుబోలు బ్రాంచ్ మేనేజర్ సంతోష్‌కుమార్ కోరారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రూ.2 వేలతో రూ.40 లక్షల ప్రమాద బీమా పథకాన్ని ఎస్‌బీఐ తెచ్చిందన్నారు.

త్వరలో ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం

బుచ్చిరెడ్డిపాలెం: బుచ్చి నగర పంచాయతీలో ట్రాఫిక్ సమస్యను త్వరలోనే పరిష్కరించేందుకు చర్యలు చేపడుతామని రూరల్ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావు అన్నారు. బుచ్చిరెడ్డిపాళెంలో ఆయన గురువారం స్థానిక సీఐ, ఎస్సై, చైర్‌పర్సన్ మోర్ల సుప్రజతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు.

పక్కాగా రీసర్వే

ఇందుకూరుపేట: భూముల రీసర్వేను పక్కాగా నిర్వహించాలని కలెక్టర్ ఆనంద్ అధికారులను ఆదేశించారు. ఇందుకూరుపేట మండలం ముదివర్తిపాళెంలో జరుగుతున్న రీసర్వేను ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. తహసీల్దార్ కృష్ణప్రసాద్, సర్వేయర్ హరనాథ్ పాల్గొన్నారు.

అనుబంధ విభాగాలకు అధ్యక్షుల నియామకం

పొదలకూరు: వైఎస్సార్‌సీపీ సర్వేపల్లి నియోజకవర్గ అనుబంధ విభాగాలకు అధ్యక్షులను నియమిస్తూ గురువారం పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు అందాయి. స్టూడెంట్ వింగ్ అధ్యక్షుడిగా మాతంగి హేమంత్‌కుమార్, కల్చరల్ వింగ్ అధ్యక్షుడిగా తురకా రామ్మోహన్ నియమితులయ్యారు.

కోవూరు నియోజకవర్గానికి సంబంధించి..

కోవూరు: కోవూరు నియోజకవర్గానికి సంబంధించి వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షులను గురువారం నియమించారు. మహిళా విభాగానికి మోర్ల జయంతి, బీసీ సెల్‌కు ముంగర శ్రీకాంత్, ఎస్టీ సెల్‌కు కవరగిరి శ్రీలత, ఆర్‌టీఐ వింగ్‌కు నర్సింహారావు, వలంటీర్ల విభాగానికి ఊటుకూరు మల్లికార్జున, వాణిజ్య విభాగానికి బండెల వెంకటరమణయ్య, వైఎస్సార్‌టీయూసీకి బిరదవోలు రూప్‌కుమార్‌రెడ్డి, అంగన్‌వాడీ విభాగానికి తాత వెంకటలత, లీగల్ సెల్‌కు బలరామిరెడ్డి చెంచురెడ్డి, సాంస్కృతిక విభాగానికి తోట పద్మనాభయ్య, సోషల్ మీడియా వింగ్‌కు రఫీ, ఐటీ విభాగానికి ఏడుగుండ్ల శశికుమార్, డాక్టర్స్ విభాగానికి అల్లాభక్షు, పబ్లిసిటీ విభాగానికి పుచ్చలపల్లి వెంకటరమణారెడ్డి, మత్స్యకార విభాగానికి బుచ్చంగారి తిరుపతయ్య, ఇంటలెక్చువల్స్ ఫోరానికి కొండ్లపూడి శ్రీనివాసులురెడ్డిని నియమించారు.

ఇందుకూరుపేటకు సంబంధించి..

ఇందుకూరుపేట: మండలానికి సంబంధించి యూత్ వింగ్‌కు గొల్లపల్లి అవినాష్, మహిళా విభాగానికి తంబు గంగమ్మ, రైతు విభాగానికి గూడూరు శివకుమార్‌రెడ్డి, బీసీ సెల్‌కు మారుబోయిన సంతోష్, ఎస్సీ సెల్‌కు గోడ సుధాకర్, ఎస్టీ సెల్‌కు వెంబేటి సురేంద్ర, మైనార్టీ సెల్‌కు సల్మా, విద్యార్థి విభాగానికి పెద్ది శరత్, వైఎస్సార్‌టీయూసీకి పామంజి కల్యాణ్ చక్రవర్తి, చేనేత విభాగానికి కొరుటూరు మహేష్, పంచాయతీరాజ్‌కు వరిగొండ శ్రావణ్, వాణిజ్య విభాగానికి మెట్టు వెంకట్రామిరెడ్డి, క్రిస్టియన్ మైనార్టీ సెల్‌కు నాగరాజు, ఇంటలెక్చువల్స్ ఫోరంకు పట్నం పృథ్వీకుమార్‌రెడ్డి, పబ్లిసిటీ విభాగానికి గుంటూరు వాసుబాబు, మత్స్యకార విభాగానికి రవికుమార్, రజకుల విభాగానికి పోలూరు పురుషోత్తంను నియమించారు.

బుచ్చి మండలానికి..

బుచ్చిరెడ్డిపాళెం: బుచ్చి మండలానికి సంబంధించి వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షులను గురువారం ప్రకటించారు. యూత్ వింగ్‌కు చిరమన సురేష్‌కుమార్, మహిళా విభాగానికి కందికట్టు మీనాకుమారి, రైతు విభాగానికి పోశంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, బీసీ సెల్‌కు తాళ్ల వెంకటేశ్వర్లు, ఎస్సీ సెల్‌కు మోచర్ల రాంగోపాల్, ఎస్టీ సెల్‌కు గాదె శ్రీజ, మైనార్టీ సెల్‌కు రషీద్అహ్మద్, విద్యార్థి వింగ్‌కు చింతగుంట నాని, లీగల్ సెల్‌కు కోరికల చంద్రశేఖర్, వైఎస్సార్ టీయూసీకి పోతిరెడ్డి నాగసుబ్బారెడ్డి, వీవర్స్ వింగ్‌కు వి.వీరాస్వామి, పంచాయతీరాజ్ వింగ్‌కు పత్తి వెంకటరమణారెడ్డి, వాణిజ్య విభాగానికి ముంగర శివ, క్రిస్టియన్ సెల్‌కు కోవూరు రాజా, పబ్లిక్ వింగ్‌కు చంద్రగిరి అశోక్‌లను నియమిస్తూ ఉత్తర్వులు అందాయి.

విడవలూరు పరిధిలో..

విడవలూరు: మాజీ ఎమ్మెల్యే, పార్టీ అధికార ప్రతినిధి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి సూచనల మేరకు మండలంలోని పలువురిని వివిధ అనుబంధ విభాగాల అధ్యక్షులుగా నియమించారు. యూత్ వింగ్‌కు నాశిన రాజశేఖర్, మహిళా విభాగానికి వయ్యాల శేషమ్మ, రైతు విభాగానికి శీలు రవి, బీసీ సెల్‌కు నిమ్మల శివయ్య, ఎస్సీ సెల్‌కు కాగొళ్లు చిన మస్తానయ్య, ఎస్టీ సెల్‌కు చొటూరు రమణమ్మ, మైనారిటీ సెల్‌కు బాబులు, విద్యార్థి వింగ్‌కు భక్తాని నవీన్, వైఎస్సార్ టీయూసీకి దాసరి కరుణాకర్, చేనేత రంగానికి పంచమూర్తి నారాయణ, పంచాయతీరాజ్‌కు పొన్నాల కృష్ణారెడ్డి, వాణిజ్య విభాగానికి గుబ్బా రాధాకృష్ణ, క్రిస్టియన్ మైనార్టీ సెల్‌కు కూనాసి విజయభాస్కర్, సోషల్ మీడియాకు కూనాసి జయప్రకాష్‌ను నియమించారు.

పెట్రోల్ బంక్‌లోకి దూసుకెళ్లిన ట్రావెల్స్ బస్సు

- త్రుటిలో తప్పిన పెను ప్రమాదం
- డ్రైవర్ నిద్రమత్తే కారణం



ప్రమాదానికి గురైన పెట్రోల్ పంపు

కోవూరు: అతివేగం, డ్రైవర్ నిద్రమత్తు కారణంగా ట్రావెల్ బస్సు పెట్రోల్ బంక్‌లోకి దూసుకెళ్లిన ఘటన కోవూరు మండలం రామన్నపాళెం హైవేపై గురువారం తెల్లవారుజామున జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. విశాఖపట్నం నుంచి బెంగళూరుకు 27 మంది ప్రయాణికులతో వెళ్తున్న నవయుగ ట్రావెల్స్ బస్సు రామన్నపాళెం గేట్ సమీపంలో రహదారి పక్కనే ఉన్న జయ ఫిల్లింగ్ స్టేషన్‌లోకి దూసుకెళ్లి పెట్రోల్ నింపే పంప్‌ను ధ్వంసం చేసి ఆగింది. ప్రమాదం జరిగిన సమయంలో పెట్రోల్ లీక్ కాకపోవడంతో భారీ ప్రమాదం తప్పింది. ఈ ఘటనలో ప్రయాణికులకు ఎలాంటి గాయాలు కాలేదు. పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. అతివేగం, బస్సు డ్రైవర్ నిద్రమత్తు కారణంగా ప్రమాదం చోటుచేసుకుందని ఎస్సై రంగనాథ్ గౌడ్ తెలిపారు. ఈ మేరకు బస్సును పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు తెలియజేశారు.

1.19 కోట్ల పనిదినాలే లక్ష్యం

- డ్వామా పీడీ గంగా భవాని



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న పీడీ

మనుబోలు: ఉపాధి హామీ పథకం ద్వారా జిల్లాలో ఏడాదికి 1.19 కోట్ల పనిదినాలు కల్పించడమే లక్ష్యమని డ్వామా పీడీ గంగా భవాని తెలిపారు. మండలంలోని కాగితాలపూరు, చెర్లోపల్లి గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను గురువారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి కూలీకి కనీసం వంద రోజులు పని కల్పించాలని సిబ్బందికి సూచించారు. జాబ్‌కార్డు లేని వారికి వెంటనే జారీ చేయాలన్నారు. అదనంగా పనులు చేసే కూలీలకు రోజుకు రూ.300 వేతనం అందేలా చూడాలన్నారు. మండలంలో ఏడాదికి 2.23 వేల పనిదినాలు కల్పించాలన్నారు. అధికారులిచ్చిన కొలతల ప్రకారమే పనులు చేయాలన్నారు. నెలరోజులుగా ఆగి ఉన్న వేతనాలను త్వరలోనే చెల్లిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏపీఓ రాజమ్మ, టీఏలు సుప్రజ, గుర్రప్ప, ఎఫ్ఏలు వెంకటరమణయ్య, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

వీఎస్‌యూలో ముగిసిన జాతీయ సదస్సు



మాట్లాడుతున్న సునీత, చిత్రంలో అధికారులు

వెంకటాచలం: మండంలోని కాకుటూరు వద్దనున్న విక్రమ సింహపురి యూనివర్సిటీ(వీఎస్‌యూ)లో సమర్థమైన ఉపాధి మార్గాల కోసం 'కొత్త మార్గాలు – గ్రామీణ వృత్తులను విస్తరించడం' అనే అంశంపై రెండు రోజులపాటు జరిగిన జాతీయ సదస్సు గురువారం ముగిసింది. ఈ సందర్భంగా వీఎస్‌యూ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలను పెంపొందించడం ద్వారా ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయొచ్చన్నారు. నూతన ఆవిష్కరణలతో గ్రామీణ వృత్తులను విస్తరించేందుకు ప్రతి విద్యార్థి ఆలోచనల్లో మార్పు తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. పలువురు అధ్యాపకులు గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలను పెంపొందించడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో మెప్మా పీడీ ఎ.రాధమ్మ, డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ నాగరాజకుమారి, ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.

పంచాయతీ రికార్డుల పరిశీలన



రికార్డులను పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ

పొదలకూరు: నెల్లూరు డీఎల్‌పీఓ పి.రమణయ్య గురువారం పొదలకూరు పంచాయతీ రికార్డులను పరిశీలించారు. పట్టణానికి చెందిన వ్యక్తులు పంచాయతీ నిధులు గోల్‌మాల్ అయ్యాయని ఇటీవల ఫిర్యాదు చేశారు. దీంతో డీపీఓ ఆదేశాల మేరకు డీఎల్‌పీఓ విచారణకు హాజరై 14, 15 ఆర్థిక సంఘం నిధులకు సంబంధించిన ఎం బుక్స్, ఓచర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మేజర్ పంచాయతీ అయినందున ఒక్కరోజులో రికార్డుల పరిశీలన పూర్తి కాదని, మరో మూడు పర్యాయాలు రికార్డులను పరిశీలించాల్సి ఉంటుందన్నారు. 2019 నుంచి ఇప్పటి వరకు పంచాయతీలో పనిచేసిన సెక్రటరీలు, స్పెషల్ ఆఫీసర్లు విచారణకు హాజరు కావాల్సి ఉంటుందన్నారు. ముందుగా నోటీసులను జారీ చేయడం జరుగుతుందన్నారు. సంబంధం లేని వ్యక్తులను రికార్డుల పరిశీలన, విచారణకు అనుతించబోమన్నారు.

సీఆర్‌సీ సేవలను వినియోగించుకోవాలి



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న రవిప్రకాష్‌రెడ్డి

- కమిషనర్ బి.రవిప్రకాష్‌రెడ్డి

వెంకటాచలం: దివ్యాంగుల ప్రాంతీయ సంయుక్త కేంద్రం (సీఆర్‌సీ) ఆధ్వర్యంలో అందిస్తున్న సేవలను వినియోగించుకోవాలని రాష్ట్ర డిజేబిలిటీ కమిషనర్ బి.రవిప్రకాష్‌రెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని సరస్వతీనగర్ వద్దనున్న సీఆర్‌సీలో గురువారం ప్రపంచ సామాజిక న్యాయ దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మల్టిపుల్ డిజేబులిటీ సర్వీసెస్ అందించే జాతీయ సంస్థ నెల్లూరు జిల్లాలో ఉండటం ఈ ప్రాంత దివ్యాంగులకు చాలా ఉపయోగకరమని తెలియజేశారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో ఉన్న దివ్యాంగులు సీఆర్‌సీ సేవలను పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. సీఆర్‌సీ డైరెక్టర్ మనోజ్‌కుమార్ మాట్లాడుతూ ఎలాంటి వివక్ష లేకుండా ప్రజలందరికీ సమన్యాయం జరగాలని ఐక్యరాజ్యసమితి పిలుపునిచ్చిన నేపథ్యంలో ప్రపంచ సామాజిక న్యాయ దినోత్సవాన్ని జరుపుకొంటున్నామని తెలియజేశారు. ఈ కేంద్రంలో దివ్యాంగులకు అన్ని రకాల సేవలు, వృత్తి నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా సీఆర్‌సీకి జిందాల్ పవర్ ప్లాంట్ యాజమాన్యం రూ.2 లక్షలు విలువ చేసే వైద్య పరికరాలు అందజేసింది.

'పది' పరీక్షలకు సిద్ధమవుతూ..



చదువుకుంటున్న విద్యార్థులు

ముత్తుకూరు: మార్చి 17వ తేదీ నుంచి ప్రారంభమయ్యే పదో తరగతి పరీక్షలకు విద్యార్థులు సిద్ధమవుతున్నారు. ఉత్తమ ఫలితాలు రాబట్టేందుకు హైస్కూళ్ల ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించారు. ముత్తుకూరు హైస్కూల్ నుంచి 96 మంది, బ్రహ్మదేవి హైస్కూల్ నుంచి 26 మంది, ఎంపీపాళెం హైస్కూల్ నుంచి 60 మంది, కృష్ణపట్నం హైస్కూల్ నుంచి 51 మంది, దమ్మాయపాళెం హైస్కూల్ నుంచి 16 మంది, దొరువులపాళెం హైస్కూల్ నుంచి 46 మంది, ముత్తుకూరు గురుకుల పాఠశాల నుంచి 84 మంది పరీక్షలు రాసేందుకు సన్నద్ధమవుతున్నారు.